ఉత్తర రాజగోపురం పనులు ప్రారంభం



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ హుడా ట్రేడ్ సెంటర్‌లోని రామాలయంలో ఉత్తర రాజగోపురం పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. రాజగోపురం పనులను కార్పొరేటర్ రాగం నాగేందర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు శ్రీనివాస్‌గౌడ్, రాఘవేంద్ర, పవన్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

నేడు మల్లికార్జునస్వామి కల్యాణం

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్లలోని మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు మల్లికార్జున, భ్రమరాంబికల కల్యాణం జరగనుంది. కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జీ, కార్పొరేటర్లు జగదీశ్వర్‌గౌడ్, పూజితాగౌడ్ పర్యవేక్షణలో కార్యక్రమం కొనసాగుతుంది. అనంతరం అన్నదానం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

6న ఆలయ వార్షికోత్సవం

రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి ఆలయం 11వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహక ప్రతినిధి డి రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. జూన్ 6వ తేదీ ఉదయం 5.30 గంటలకు సాయిబాబాకు కాగడ హారతితో ఉత్సవాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.ఉదయం 6.30 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, మంటపారాధన, 8 గంటలకు గణపతి, దత్తాత్రేయ స్వామి, సాయిబాబాకు పంచామృతాభిషేకం, మంగళస్నానాలు ,సాయిచాలీసా, నక్షత్రమాలిక పారాయణం, భజన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

అన్నదానం



ఖాజాగూడలో అన్నదానం

రాయదుర్గం: కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి మాజీ అధ్యక్షుడు కొమిరిశెట్టి మాణిక్‌రావుకు శనివారం ఘన నివాళులు అర్పించారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకొని ఖాజాగూడలో బీఆర్ఎస్ నాయకుడు కొమిరిశెట్టి సాయిబాబా, పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అన్నదానం చేశారు.

బాడీక్రాఫ్ట్ సెలూన్ ప్రారంభం



సెలూన్‌ను ప్రారంభిస్తున్న దర్శకుడు తరుణ్‌భాస్కర్

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలో బాడీక్రాఫ్ట్ సెలూన్‌ను దర్శకుడు తరుణ్‌భాస్కర్ శనివారం ప్రారంభించారు. సెలూన్ డైరెక్టర్ స్వాతి గుప్తా మాట్లాడుతూ ప్రతి వినియోగదారునికి నాణ్యమైన సేవలను అందించడమే లక్ష్యమన్నారు. దర్శకుడు నాగేశ్వరరావు, ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ మంజులారెడ్డి, నాయకులు రఘునాథ్‌రెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



చందానగర్: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం చందానగర్‌లో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. పొగాకు ఉత్పత్తుల వినియోగం వలన వచ్చే ఆరోగ్య సమస్యలతో పాటు జరిగే అనర్థాలను తెలియజేసే పోస్టర్‌ను మియాపూర్ ఏసీపీ సీహెచ్‌వై. శ్రీనివాస కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగతాగడం వలన ఊపిరితిత్తులు, గుండె జబ్బులు, క్యాన్సర్లు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామి యాదవ్, ఉపాధ్యక్షులు మారబోయిన సదానంద యాదవ్, సభ్యులు జనార్దన్, పాలం శ్రీను, అమ్మయ్య చౌదరి, శివరామకృష్ణ, వాణిసాంబశివరావు, ప్రేమ్‌సింగ్, జిల్ మల్లేష్, శ్యామ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి ఒడిలో నడక

నాలుగున్నర కిలోమీటర్ల వాకింగ్ ట్రాక్.. 3 వేల మంది వాకర్స్

- మూడు ఓపెన్ జిమ్‌లు, యోగా సెంటర్
- బొటానికల్ గార్డెన్‌లో సేదదీరుతున్న వేలాదిమంది



బొటానికల్ గార్డెన్‌లో వాకింగ్ చేస్తున్న వాకర్స్

గచ్చిబౌలి: ప్రకృతి ఒడిలో వాకింగ్.. వ్యాయామం, యోగా .. ఐటీ కారిడార్‌లోని బొటానికల్ గార్డెన్‌లో రోజు వేలాదిమంది తమ ఆరోగ్యాన్ని రక్షించుకుంటున్నారు. కొత్తగూడలో కోట్ల విజయభాస్కర్‌రెడ్డి బొటానికల్ గార్డెన్‌లో వాకింగ్, వ్యాయామం చేసే వారి కోసం టీజీఎఫ్‌డీసీ (అటవీ అభివృద్ధి సంస్థ) అనేక సౌకర్యాలను ఏర్పాటు చేసింది. ఉదయం, సాయంత్రం సమయాల్లో వాకర్స్ కనిపిస్తారు.

వేల సంఖ్యలో వాకర్స్

బొటానికల్ గార్డెన్‌కు వాకింగ్, వ్యాయామం చేసేందుకు వచ్చే వారి సంఖ్య మూడున్నర వేల వరకు ఉంటుంది. సంవత్సరం పాస్‌లు తీసుకున్న వారు 1800 మంది ఉండగా నెల వారీ పాస్‌లు తీసుకున్న వారు 1500 మంది.. ఇక రోజువారీ పాస్‌లు తీసుకునే వారు ఉంటారు. ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు వాకింగ్ చేసేందుకు వీలుంటుంది. చెట్ల మధ్యలో ఆహ్లాదకరమైన వాతావరణంలో పురివిప్పిన నెమళ్లు కనిపిస్తాయి. వీకెండ్‌లో వాకర్స్ సంఖ్య ఎక్కువగా ఉంటుంది. వాకింగ్ చేసిన తరువాత ప్లే ఏరియాలో సేదదీరతారు.

మహిళలు.. పురుషులకు ప్రత్యేకంగా..

బొటానికల్ గార్డెన్‌లో వ్యాయామం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సీనియర్ సిటిజన్స్, మహిళలు, పురుషుల కోసం వేర్వేరుగా మూడు ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు. వాకింగ్ చేసిన అనంతరం జిమ్‌లో వ్యాయామం చేస్తారు. యోగా సెంటర్‌ను సైతం ఏర్పాటు చేశారు. వీకెండ్‌లో లాన్‌లో యోగా చేస్తారు. కొందరు ఉచిత యోగాను ప్రతి రోజు నిర్వహిస్తారు. అప్పుడప్పుడు కార్పొరేట్ కంపెనీలు ప్రత్యేకంగా యోగా తరగతులు నిర్వహిస్తారు.



ఫ్రెష్ జ్యూస్‌లు.. టిఫిన్‌లు

వాకింగ్, వ్యాయామం చేసిన తరువాత తాగేందుకు స్టాళ్లలో ఫ్రెష్ జ్యూస్‌లు అందుబాటులో ఉంటాయి. కాకరకాయ, గుమ్మడికాయ, సొరకాయ, కీర, క్యారెట్, బీట్‌రూట్ తదితర జ్యూస్‌లను విక్రయిస్తారు. మిల్లెట్ టిఫిన్స్ అందుబాటులో ఉన్నాయి.





యోగా సెంటర్, లాన్‌లో యోగా చేస్తున్న దృశ్యాలు

రైల్వే సమస్యలు పరిష్కరించండి

కేంద్రమంత్రి సోమన్నకు ఎంపీ రఘునందన్‌రావు వినతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నియోజకవర్గంలో నెలకొన్న రైల్వే సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేంద్ర రైల్వే సహాయమంత్రి వి.సోమన్నను మెదక్ ఎంపీ రఘునందన్‌రావు కోరారు. శనివారం కర్ణాటకలోని బీదర్ వెళ్తున్న సోమన్న ఎంపీ రఘునందన్‌రావు విజ్ఞప్తి మేరకు తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల నాగులపల్లి రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు రఘునందన్‌రావు ఘనస్వాగతం పలికారు. కొల్లూరు, వెలిమెల మధ్యలోని రైల్వే లైన్‌పై నిర్మిస్తున్న బ్రిడ్జిను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా వంతెన పనులు నత్తనడకన సాగుతున్నాయని పనులను వేగవంతం చేయాలని ఎంపీ కేంద్రమంత్రికి వివరించారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో అనేక కొత్త కాలనీలు వస్తున్నాయని దానిని దృష్టిలో పెట్టుకుని రైల్వే సేవలను మరింత పెంచాలని కోరారు. గతంలో రైల్వే టెర్మినల్ కోసం 508 ఎకరాల భూమిను కేటాయించారని, ఈ ప్రాంతంలో నూతనంగా ఆర్‌యూబీ నిర్మాణానికి అనుమతినివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్రమంత్రికి ఎంపీ రఘునందన్‌రావు వినతిపత్రం అందజేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందిస్తూ...సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి, మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, నాయకులు శంషాబాద్ రాజు, రాంబాబుగౌడ్, సంతోష్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

కనువిందు..



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహించే వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం ఓంకార పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ సెంటర్ చెన్నై గురువు నాట్యరత్నం ప్రతీష్ శివానందం, గురువు షిబా ప్రతీష్ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శనతో సందర్శకులను అలరించారు. ఇందులో పుష్పాంజలి, పదం, కాలభైరవం, కీర్తనం, తాండవం, హరిస్తోత్రం, శంభో మహదేవ, రామాష్టకం, నర్సింహకౌతం, రాగమాలిక జతిస్వరం, అయ్యప్పన్ తదితర అంశాలను కళాకారులు మోనిషా, సాధనశ్రీ, జోషిక, జీవన, కార్తీక, పూర్విత, నేత్ర, శుభశ్రీ, మేఘశ్రీ తదితరులు పాల్గొని ప్రదర్శించారు.

అన్నమయ్యపురంలో..

అన్నమయ్యపురంలో అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రీకృతి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ గురువు లిలతారమేశ్ శిష్యబృందం కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించారు. వినరో భాగ్యము, శుద్ధబ్రహ్మ, జగడపు చనువుల, పరమ పురుషుడు, రంగని కళ్యాణం, శ్రీమన్నారాయణ, అలరులు కురియగా, దేవదేవంభజే కీర్తనలకు తమ నృత్యప్రదర్శనలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. కళాకారులు శ్రీకృతి, రుత్విక, జగ్వి, నిహారికరెడ్డి, వైష్ణవి, జాహ్నవి, నాగజయ, శ్రీసన్నిద్, జొసలిశాన్వి, హన్విత, సమన్వి, గీతాన్విత, మెరుగుచరిష్మ, తన్మయి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కళాకారులను అన్నమాచార్య భావనావాహిని నిర్వాహకులు అర్చన కోదాటి, రాజరాజేశ్వరి జ్ఞాపికలను అందజేశారు.



సమస్యల పరిష్కారానికే పాదయాత్ర

కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: ప్రజాసమస్యలు తెలుసుకొని పరిష్కరించడానికే కాలనీలు, బస్తీలలో పాదయాత్ర చేస్తున్నాని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తెలిపారు. గచ్చిబౌలి డివిజన్ నానక్‌రాంగూడలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా భూగర్భ డ్రైనేజీ పనులు, పెండింగ్‌లో ఉన్న రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి సర్కిల్ ఏఈ రషీద్, బీజేపీ గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు శివాసింగ్, నాయకులు మీన్‌లాల్‌సింగ్, రంజిత్‌సింగ్, కై లాష్‌సింగ్, అనంత్‌రెడి నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, కవిత బాయి, సంతోష్, శేఖర్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్

యువకుడు మృతి

గచ్చిబౌలి: బైక్‌ను వెనక నుంచి టిప్పర్ ఢీ కొట్టడంతో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకునికి తీవ్ర గాయాలైన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మహేష్ గౌడ్ తెలిపిన ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా, రామచంద్రాపురం మండలం కందులపాలెంకు చెందిన దుర్గా కిరణ్(25) గచ్చిబౌలి పీజేఆర్‌నగర్‌లో నివాసం ఉంటూ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నారు. స్నేహితుడు వెంకటదుర్గా ప్రసాద్‌తో కలిసి శనివారం తెల్లవారు జామున 4.30 గంటల సమయంలో బైక్‌పై బీరంగూడకు బయలుదేరారు. ట్రిపుల్ ఐటీ సమీపంలో వెనక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ ఢీ కొట్టడంతో ఇద్దరు ఎగిరి కిందపడ్డారు. బైక్ నడుపుతున్న దుర్గా కిరణ్‌కు తీవ్రగాయాలవడంతో సమీపంలోని కేర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు ధ్రువీకరించారు. బైక్ వెనక ఉన్న వెంకట దుర్గా ప్రసాద్ కుడి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పదవీ విరమణ చేసినా సమాజానికి తోడ్పాటునందించాలి



సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పదవీవిరమణ చేసిన వారితో సీపీ అవినాష్‌మహంతి తదితరులు

సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

రాయదుర్గం: పదవీ విరమణ చేసినా తమ అనుభవాన్ని, జ్ఞానాన్ని పంచడం ద్వారా సమాజానికి తోడ్పడాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి సూచించారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో శనివారం పదవీ విరమణ చేసిన అధికారులు, పోలీసులను ఆయన ఘనంగా సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ వ్యక్తిగత శ్రేయస్సు, ఆరోగ్యం, అభిరుచులపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం పదవీ విరమణ చేసిన కేపీహెచ్‌బీ ట్రాఫిక్ ఎస్ఐ ఎం రవీందర్‌రెడ్డి, సూరారం ఎస్ఐ కుమారస్వామి, మియాపూర్ ట్రాఫిక్ ఎస్ఐ మక్బూల్‌పాషా, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ యాంటీ సెక్షన్ ఏఆర్ఎస్ఐ జి ప్రతాప్ రెడ్డి, హెడ్‌కానిస్టేబుళ్లు వెంకట సత్యనారాయణ, బి వెంకన్నలను సీపీ సత్కరించారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ ట్రాఫిక్ డాక్టర్ గజారావుభూపాల్, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ, అడ్మిన్ ఏడీసీపీ రవిచందన్‌రెడ్డి, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ ఏడీసీపీ షమీర్, సీఏఓ అకౌంట్స్ వెంకట్‌రెడ్డి, అడ్మిన్ ఏఓ రషీదాబేగం, పోలీసు అధికారులు, సిబ్బంది, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్



ఆల్విన్‌కాలనీ: యుద్ధ ప్రాతిపదికన సీసీ రోడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఇంద్రహిల్స్ కాలనీలో రూ.28 లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఏఈ శ్రావణితో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డును లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలవకుండా చూడాలన్నారు. పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, కాలనీ అధ్యక్షులు వెంకట్‌నాయక్, జి. రామారావు, మోహన్‌రావు, రంజిత్, మోహన్, లస్వామి, పి. వెంకటయ్య, శ్యామ్, యాదయ్య, లక్ష్మి, వర్క్ఇన్‌స్పెక్టర్ రవికుమార్, కాలనీవాసులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యను అందించాలి

హెచ్‌సీయూ ప్రొ.మధుసూదన్

రాయదుర్గం: విద్యాసంస్థలు విలువలతో కూడిన విద్యను అందించాలని హెచ్‌సీయూ విద్యా, సాంకేతిక విద్యా విభాగం హెడ్ ప్రొఫెసర్ జీవి మధుసూదన్ సూచించారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో శనివారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ, సీబీఎస్ఈ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల సీబీఎస్ఈ ప్రిన్సిపల్స్ సమావేశం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో విలువలకు అనుగుణంగా ప్రయోగశాలలను కూడా ఏర్పాటు చేసి వినూత్న ప్రయత్నాలకు శ్రీకారం చుట్టాలన్నారు. హెచ్‌సీయూ సోషియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ జి నాగరాజు మాట్లాడుతూ ఆధునిక విద్యారంగం ప్రాముఖ్యతను వివరించారు. హెచ్‌సీయూ సీనియర్ ప్రొఫెసర్ ఘన్‌శ్యామ్‌కృష్ణ మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి 2019లో ఐఓఈ హోదా లభించిందని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 8 విద్యాసంస్థలలో హెచ్‌సీయూ ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు, సీబీఎస్ఈ ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.



హెచ్‌సీయూలో సీబీఎస్ఈ ప్రిన్సిపల్స్ సమావేశం

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



మియాపూర్: అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల మూతలు ధ్వంసం కావడంతో ప్రమాదకరంగా మారాయి. మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎంఏనగర్ కాలనీ ప్రధాన రహదారి మూలమలుపు వద్ద డ్రైనేజీ పైప్‌లైన్ మూత ధ్వంసమైంది. దీంతో ఎప్పుడూ ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. మ్యాన్‌హోళ్ల మూతల ఏర్పాటులో నాణ్యత లేకపోవడంతో మూన్నాళ్లకే ధ్వంసమైపోతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధ్వంసమైన మూతలు కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా స్థానికులు బండరాళ్లు, కట్టెలను ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించి మూతలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పైప్‌లైన్ పనులను వేగవంతం చేయాలి

కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్: మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తాన్నామని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీ నుండి మియాపూర్ వరకు చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ మరమ్మతు పనులు, బాలాజీనగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన వీధిదీపాల పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డ్రైనేజీ పైప్‌లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రతి కాలనీ, బస్తీలలో పనిచేయని వీధిదీపాలను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

ప్రధాన, అంతర్గత రోడ్లను బాగు చేయాలి

జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ వినతి

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లో వర్షాలకు దెబ్బతిన్న ప్రధాన, అంతర్గత రోడ్లను బాగు చేయాలని కోరుతూ జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడేను కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు జోనల్ కమిషనర్ కార్యాలయంలో శనివారం కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. డివిజన్‌లోని నానక్‌రాంగూడ, నేతాజీనగర్, రాయదుర్గం, నల్లగండ్ల, హుడా కాలనీలలో రోడ్లు వర్షాలకు దెబ్బతిన్నాయని ,గుంతలు పడిన చోట వర్షపునీరు నిల్వ ఉంటోందని చెప్పారు. ఐటీ కారిడార్ కావడంతో రోజురోజుకీ వాహనాల సంఖ్య పెరుగుతుండడంతో ప్రధాన రోడ్ల విస్తరణ చేయాలని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించి తక్షణమే అంచనా వేయించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు గంగాధర్‌రెడ్డి వివరించారు.



జెడ్‌సీ హేమంత్‌బోర్ఖడేకు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

ప్రిజం పబ్‌లో గలాట

గచ్చిబౌలి: ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ప్రిజం పబ్‌లో కేక్ విషయంలో ఓ సినీ నటికి, పబ్ సిబ్బందికి వాగ్వాదం చోటుచేసుకుంది. దీన్ని ఇన్‌స్టాగ్రాంలో పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారింది. శుక్రవారం రాత్రి బర్త్ డే చేసుకునేందుకు ఓ నటి స్నేహితులతో కలిసి ప్రిజం పబ్‌కు వెళ్లింది. కేక్ విషయంలో సిబ్బంది దురుసుగా ప్రవర్తించారని, డ్రగ్ ఎడిక్ట్ అంటూ దూషించారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆమె సోషల్ మీడియాలో వాపోయింది. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్ తెలిపారు. కాగా ఓ నటి గొడవ చేస్తుందని పబ్ నిర్వాహకులు డయల్ 100కు కాల్ చేయగా పోలీసులు వెళ్లి నచ్చచెప్పారని ఆయన పేర్కొన్నారు.

కల్వర్టు పరిశీలన

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శనివారం బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కై త్లాపూర్, శ్రీరామ్‌నగర్ కాలనీలో పర్యటించారు. శ్రీరామ్‌నగర్ కాలనీలోని కల్వర్ట్‌ను పరిశీలించారు. అనంతరం స్థానికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

గుర్రపుడెక్కమయం

శేరిలింగంపల్లి చాకలివానికుంట గుర్రపుడెక్కమయంగా మారింది. పాపిరెడ్డికాలనీకి వెళ్లే రోడ్డు పక్కన ఉన్న చాకలివాని కుంటలో 4 నెలల క్రితం గుర్రపుడెక్కను తొలగించారు. దాన్ని తరలించకుండా వదిలేయడంతో తిరిగి మళ్లీ చెరువంతా అలుముకుంది. పరిసర ప్రాంతవాసులు దోమలు, దుర్వాసనతో ఇబ్బందులుపడుతున్నారు. కాగా డ్రైనేజీ కాలువల నుంచి మురుగునీరు ఈ చెరువులో చేరుతోందని రాకుండా పైప్‌లైన్ వేసి నాలాల్లోకి కలపాలని స్థానికులు కోరుతున్నారు.

–శేరిలింగంపల్లి

